సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మరో ముగ్గురు ఆర్పీల తొలగింపు

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డులో మరో ముగ్గురు ఆర్పీలను తొలగిస్తూ మెప్మా డైరెక్టర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వార్డులో ఐదుగురు ఆర్పీలు పనిచేస్తున్నారు. వీరందరూ ప్రభుత్వ ఉద్యోగుల భార్యలు కావడంతో వారిని తొలగించాలని కొందరు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదుల మేరకు ఇప్పటికే ఇద్దరిని తొలగించారు. మిలిగిన ముగ్గురిని తొలగిస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో వార్డులో ఐదుగురు ఆర్పీలను తొలగించినట్టయింది.

కరెంట్ కోతలతో ఉక్కిరిబిక్కిరి

ఆరిలోవ : ఆరిలోవలో కరెంట్ కోతలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అసలే ఎండలు మండిపోతున్నాయి. ఫ్యాన్‌లు తిరిగితేగానీ ఇంట్లో గడపలేని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ఓ వైపు పగటి కోతలు, మరోవైపు అప్రకటిత కోతలతో కరెంట్ లేక స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రోజులో ఏ సమయంలో, ఎప్పుడు కరెంట్ పోతుందో తెలియడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా ఉక్కపోతతో గడపాల్సి వస్తోందని అంటున్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరిలోవ కాలనీ, నలబై గజాల రోడ్డు, శివాజీనగర్, దుర్గాబజార్, నెహ్రూనగర్, టి.ఐ.సి.పాయింట్, భరత్‌నగర్, ఎస్టీ కాలనీ, డ్రైవర్స్ కాలనీలో సుమారు 10 నుంచి 15 సార్లు కరెంట్ ఆగిపోయింది. ప్రతిసారీ అరగంట నుంచి గంట పాటు నిలిచిపోయిందని, ఫోన్ చేసినా ఆరిలోవ విద్యుత్ సరఫరా విభాగం ఏఈ, సిబ్బంది స్పందించడం లేదని స్థానికులు అంటున్నారు. ఇన్నిసార్లు కరెంట్ పోయినా సమస్య తెలుసుకోవడానికి కూడా సిబ్బంది కనిపించడం లేదని, ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలికల గృహానికి వితరణ



ప్రభుత్వ బాలికల గృహం సిబ్బందికి సామగ్రి అందజేస్తున్న సభ్యులు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ సమీప ప్రభుత్వ బాలికల గృహానికి నేవీ వెల్ఫేర్ వెల్‌నెస్ అసోసియేషన్ పలు వస్తువులు అందించింది. ఇక్కడి గదులకు సున్నం వేయడానికి కావాల్సిన మెటీరియల్‌తోపాటు ఆర్వో ప్లాంట్, బాలికలకు అవసరమైన వస్తువుల ప్యాకెట్లు బుధవారం అందజేశారు. వీటితోపాటు స్వాతంత్ర్య వేడుకల్లో బాలికలకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూలో నూతన సంస్థ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆ హబ్ ప్రాంగణంలో నూతనంగా ఆస్క్రిప్షన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను బుధవారం ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎస్.ధనుంజయరావు ప్రారంభించారు. సంస్థ అందించే సేవలు, తదితర అంశాలను సీఈవో ఎం.కోటేశ్వరరావు, సీటీవో పి.సురేష్ బాబు వివరించారు. సంస్థ నిర్వాహకులను ఆచార్య ధనుంజయరావు అభినందించారు. మానవులకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధార్ సేవల తరహాలో పశువులకు గోధార్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ అంశంపై ఆస్క్రిప్షన్ సంస్థ పనిచేస్తుంది. కార్యక్రమంలో ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకట్రావు, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు తదితరులు పాల్గొన్నారు.

కవర్లు వినియోగిస్తే చర్యలు

మద్దిలపాలెం: వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని 16వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు హెచ్చరించారు. హెచ్‌బీ కాలనీ ప్రాంతంలోని చేపల వ్యాపారులు, సులభ్ కాంప్లెక్సు వద్ద ఉన్న టిఫిన్ దుకాణం పరిసరాల్లోని వారికి బుధవారం జరిమానాలు విధించారు. చేపల వ్యాపారులకు రూ.2 వేలు, టిఫిన్ దుకాణాలకు రూ.500, చిన్న చిన్న వ్యాపారులకు రూ.200 నుంచి రూ.500 వరకు జరిమానాలు విధించారు. వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. మరోసారి వాటిని వినియోగిస్తే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. సచివాలయం శానిటరీ సెక్రటరీలు శివ, సాంబమూర్తి, గౌతమి, నమ్మి చిన్నరాజు, జి.రాజు, బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

ఎనీ టైమ్ మందు

వేళాపాలా లేకుండా ఆరిలోవలో మద్యం విక్రయాలు

- నిబంధనలు పట్టించుకోని బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు
- అర్ధరాత్రి, వేకువజామున షట్టర్లు మూసేసి కిటికీల నుంచి మద్యం విక్రయం
- సమీపంలోనే ఎక్సైజ్ శాఖ కార్యాలయమున్నా చర్యలు శూన్యం
- 24 గంటలూ మత్తులో జోగుతూ రోడ్లపై మందుబాబుల హల్‌చల్





గీతా బార్ వద్ద ఉదయం 8 గంటల సమయంలో మద్యం తాగుతున్న మందుబాబులు



ఆరిలోవ కాలనీలో సరిగమ బార్ వద్ద ఉదయం 7 గంటలకు మూసి ఉన్న గేటు నుంచి మద్యం విక్రయాలు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో 24 గంటలూ మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్న బార్లలో వేళాపాలా లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. బార్లు షెట్టర్లు మూసేసి గేట్లు, పక్కనున్న కిటికీల నుంచి అనధికారికంగా మద్యం విక్రయాలు జరుపుతున్నారు. నిబంధనలు పాటించకుండా మందుబాబులకు నిత్యం అందుబాటులో ఉండి వారికి మత్తెక్కిస్తున్నారు. ఏ సమయంలో విక్రయించినా ఎక్సైజ్ అధికారులు మన జోలికి రారనే ధీమాతో దర్జాగా వారి పని వారు చేసుకుపోతున్నారు. నిజానికి బార్ల లోపల మద్యం తాగడానికి ఏర్పాట్లు చేస్తారు. వాటికి సమయపాలన పాటించాలని ఎక్సైజ్ శాఖ నుంచి ప్రత్యేకంగా నిబంధనలు ఉన్నాయి. ఆరిలోవ ప్రాంతంలో ఆరిలోవ కాలనీలో సరిగమ బార్ అండ్ రెస్టారెంట్, అంబేడ్కర్ కూడలి వద్ద గీతా బార్ అండ్ రెస్టారెంట్, పాత డెయిరీఫారం వద్ద బార్ అండ్ రెస్టారెంట్‌ల నిర్వాహకులకు మాత్రం ఆ నిబంధనలతో పనిలేదు. బార్లు మాత్రం మూసే ఉంచి... వాటి పక్కన కిటికీలు, గేట్లు లోపలి నుంచి మద్యం విక్రయాలు జరుపుతున్నారు. దీంతో 24 గంటలూ మద్యం విక్రయించి సొమ్ము చేసుకోవడమే వారి పనిగా మారింది. నిత్యం మద్యం లభించడంతో మందుబాబులు బహిరంగంగా మందు తాగుతూ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నారు.

రాత్రి 11 తర్వాత గేట్లు మూసేసి విక్రయాలు

సాధారణంగా బార్లుకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఎక్సైజ్ శాఖ అనుమతి ఇచ్చింది. ఎక్సైజ్ శాఖ నిబంధనలను కూడా బార్లు యజమానులు పక్కన పెడుతున్నారు. వేళాపాలా లేకుండా మద్యం విక్రయాలు దర్జాగా జరిపేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్నప్పటికీ ఆ శాఖ అధికారులు మాత్రం వాటి జోలికి వెళ్లకపోవడంతో స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాప్ వద్ద సరిగమ రెస్టారెంట్ అండ్ బార్‌లో 24 గంటలూ మద్యం విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారుల నిబంధనల ప్రకారం ఉదయం 11 గంటలకు తెరిచి రాత్రి 11 గంటలకు మూసేస్తున్నారు. ఆ తర్వాత సమయంలో ఈ బార్ గేటు లోపల ఓ మనిషి మద్యం విక్రయాలు చేస్తుంటాడు. గేటు ముందు మద్యంలో కలుపుకోవడానికి వాటర్ కేన్‌లు, ఖాళీ మద్యం బాటిళ్లు, డిస్పోజిబుల్ గ్లాసులు వేయడానికి పక్కనే డస్ట్‌బిన్‌లు కూడా ఏర్పాటు చేశారు. అర్ధరాత్రి, వేకువజామున, తెల్లవారుజామున అనే సమయం లేకుండా మందు అందుబాటులో ఉంచుతున్నారు. అంబేడ్కర్ కూడలి – బాలాజీనగర్ మధ్యలో గీతా బార్ అండ్ రెస్టారెంట్ రాత్రి 11 గంటలకు మూసేసి అనంతరం పక్కన కిటికీల నుంచి మద్యం విక్రయిస్తున్నారు. పాత డెయిరీఫారం వద్ద బార్ అండ్ రెస్టారెంట్‌ది కూడా ఇదే పరిస్థితి. ఆయా బార్లు ముందు మందుబాబులు పూటుగా తాగి రోడ్లపైనే వీరంగం వేస్తున్నారు.

డెయిరీ ఫారం, ఆరిలోవ ప్రాంతాలకు కూతవేటు దూరంలోనే విశాలాక్షినగర్‌లో ఎక్సైజ్ శాఖ జిల్లా ప్రధాన కార్యాలయం ఉంది. అయినప్పటికీ ఆ శాఖ అధికారులు ఎవ్వరూ ఈ ప్రాంతంలోని బార్లవైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం. వారి కనుసన్నల్లోనే బార్ అండ్ రెస్టారెంట్లలో 24 గంటలు మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో

పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ అధికారులు

పాటు బహిరంగంగా మద్యం సేవిస్తున్నప్పటికీ ఆరిలోవ పోలీసులు ఈ బార్లు వద్దకు చేరడం లేదు. బహిరంగంగా మద్యం తాగడం నిషేధమైనప్పటికీ బార్ అండ్ రెస్టారెంట్ల జోలికి పోలీసులు వెళ్లకపోవడం విశేషం. రోడ్ల పక్కన కూర్చొని మద్యం తాగుతున్న వారిని పట్టుకుని జరిమానా విధిస్తున్న పోలీసులు కూడళ్లలో సమయపాలన లేకుండా బహిరంగంగా పూటుగా తాగుతున్న వారిని విచ్చలవిడిగా వదిలేస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి వేళాపాలా లేని మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

చంద్రబాబు పాలనకు చరమగీతం పాడాలి

వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు



23వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న మొల్లి అప్పారావు



16వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మొల్లి అప్పారావు, నాయకులు

మద్దిలపాలెం: చంద్రబాబు నియంతృత్వ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. జీవీఎంసీ 16వ వార్డు అంబేడ్కర్ నగర్‌లోని 260వ నంబరు బూత్ పరిధిలో వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్ అందుబాటులోకి తీసుకొస్తే ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం వాటిని రద్దు చేయడం దురదృష్టకరమన్నారు. నియంతృత్వ పరిపాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం గద్దె దిగే వరకూ ప్రజలందరూ సహకరించాలని కోరారు. బూత్ కన్వీనర్ గుర్ల వెంకటరమణ, మహిళ విభాగం అధ్యక్షురాలు ఒమ్మి పోలరత్నం, మీసాల ప్రదీప్, బొచ్చ లక్ష్మణరావు, బొట్ట శివ, కంచుమూర్తి విజయ్, ఈశ్వర్, పైడిరాజు, దమరసింగి వెంకటరమణ, డొక్కర రాజు, కన్నారావు, పిట్ట రాజు, తంగేటి రవి, జగదీశ్వరి, సంధ్య, పార్వతి, వేములవలస అప్పారావు, బొట్ట కిషోర్, బమ్మిడి జోగారావు, అచ్చి కోటి, ఆనాపు సత్యనారాయణ, ఫిరోజ్, దల్లి రాజు, సన్యాసమ్మ, కొండమ్మ, అరుణ, హేమ, రేవతి, సూరిశెట్టి చిన్ని పాల్గొన్నారు.

- జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలోని 241, 254వ నంబరు బూత్‌ల పరిధిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమం వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు బూస రమణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లి అప్పారావు గడప గడపకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి చంద్రబాబు మోసాలు, అరాచకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బోర కుమార్ రెడ్డి, గుడ్ల గణేష్ రెడ్డి, ఎంద్రెడ్ల ఈశ్వర రెడ్డి, పులగం సూర్యనారాయణ రెడ్డి, పులగం శ్రీనివాస్ రెడ్డి, బోయి త్రినాథ రెడ్డి, పులగం కొండారెడ్డి, నగిరెడ్ల పోలిశెట్టి, ఎరుసు అరుణ, గుడ్ల నర్సింగ్ రెడ్డి, పిండింట్ల నర్సింగరావు రెడ్డి, పుట్ట రమణమ్మ, ఎరుసు మంగ, గుమ్మడి మణి, కె.వి. రమణ, బోర రామిరెడ్డి, బోర సూరమ్మ, అచ్చి సుధీర్ రెడ్డి, బోయి రమణ రెడ్డి, పిలక మధుసూదన రెడ్డి, గుదే శ్రీనివాసరావు, కారపురెడ్డి దుర్గా శ్రీనివాస్, గుడ్ల కైలాస్ రెడ్డి, గేదెల వెంకటలక్ష్మి, సాల చిన్ని, చిల్ల నారాయణరావు, కొనిసి సూర్యనారాయణ, కావూరి సుజాత, గుడ్ల లక్ష్మణ్ రెడ్డి, సీరపు రామలక్ష్మి పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

ఎంవీపీ కాలనీ : ఎన్నికల మేనిఫెస్టో అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన మోసాలను వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. జీవీఎంసీ 17వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నీలా రెడ్డి, 140వ నంబరు బూత్ కన్వీనర్ కండిపల్లి కుమార్ ఆధ్వర్యంలో బుధవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దె నెక్కేందుకే కూటమి నాయకులు ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చారన్నారు. హామీలను నెరవేర్చే వరకు నాయకులను నిలదీయాలని ప్రజలకు సూచించారు. వార్డు మహిళ విభాగం అధ్యక్షురాలు, బూత్ కన్వీనర్ పిల్లా సత్యవతి, రంగాల శివ, పలికిల రామిరెడ్డి పాల్గొన్నారు.



జీవీఎంసీ 17వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎంఎల్‌బీటీ పాఠశాలలో హర్ ఘర్ తిరంగా



జాతీయ పతాకాలతో విద్యార్థులు

ఏయూ క్యాంపస్ : బీచ్‌రోడ్డులోని ఎంఎల్‌బీటీ పాఠశాలలో స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు జాతీయ పతాకాలు పట్టుకుని వలయాకారంలో నిల్చొని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కార్యదర్శి డి.వి.ఎస్ కామేశ్వరరావు మాట్లాడుతూ దేశ భక్తి, క్రమశిక్షణ పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ కె.మధురవాణి మాట్లాడుతూ దేశం పట్ల అంకితభావంతో ఉండాలని సూచించారు. ప్రతీ పౌరుడు దేశ అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.శ్యామల ఆధ్వర్యంలో విద్యార్థులు కవాతు నిర్వహించారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కోలాటమాడుతున్న విద్యార్థులు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్ నూతన భవనంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకాన్ భవనం ఆవరణను పూలమాలలు, పచ్చని తోరణాలతో అలంకరించారు. ఉపాధ్యాయులు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు కోలాటం, నృత్యాలతో సందడి చేశారు. ఇక్కడ కట్టిన ఉట్టిని కొట్టడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహం కనబరిచారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కృష్ణ భగవానుని విగ్రహానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, ఉపాధ్యాయులు పూజలు చేశారు. అనంతరం చిన్నారులు కృష్ణుడు, రాధిక, గొల్లభామ తదితర వేషధారణతో చేసిన నృత్యాలు అలరించాయి.

హెల్త్ ఎరీనాలో అనధికారిక నిర్మాణం



భారీ వృక్షాలు నరికి స్థలాన్ని ఆక్రమిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు



షటిల్ కోర్టు కోసం కాంక్రీట్ షెడ్డు నిర్మాణానికి తవ్విన భారీ గోతులు

ఎంవీపీ కాలనీ: కైలాసగిరి కొండను ఆనుకుని ఎంవీపీ కాలనీ సెక్టార్ – 12, సెక్టార్ – 6లో విస్తరించిన వీఎంఆర్‌డీఏ హెల్త్ ఎరినాలో ఓ అనధికారిక నిర్మాణం కలకలం సృష్టించింది. కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హెల్త్ ఎరీనాను అనుకుని ఉన్న స్థలాన్ని ఆక్రమించి సొంత కార్యకలాపాలకు వాడుకునేందుకు నిర్మాణాలు చేపడుతున్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6 దరి హెల్త్ ఎరీనాను ఆనుకుని ఉన్న వీఎంఆర్‌డీఏ స్థలాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. అక్కడున్న భారీ వృక్షాలను తొలగించి కొన్ని రోజులుగా స్థలాన్ని చదును చేస్తున్నారు. సుమారు 300 నుంచి 400 గజాల పరిధిలో షటిల్ కోర్ట్ తయారు చేశారు. దీంతోపాటు ఆ కోర్టును కాంక్రీట్ షెడ్డుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా కోర్టు చుట్టూ భారీ గోతులు తవ్వుతున్నారు. కొందరు స్థానికుల అండతో గుర్తు తెలియని వ్యక్తులు ఇక్కడ ఇండోర్ తరహా షటిల్ కోర్టు నిర్మించి కమర్షియల్‌గా వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతున్నా హెల్త్ ఎరీనా అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. భారీ వృక్షాలను అనుమతి లేకుండా ఎలా తొలగించారనే దానిపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని వాకర్స్‌తోపాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎడాపెడా తవ్వి పడేస్తున్నారు..!



విచ్చలవిడి తవ్వకాలతో అధ్వానంగా మారిన బీచ్‌రోడ్డు



సిమెంట్ పైపులు పడేయడంతో విరిగిపోయిన ఫుట్‌పాత్ గ్రిల్స్

- బీచ్‌రోడ్డులో ఇష్టారాజ్యంగా యూజీడీ తవ్వకాలు
- పెద్ద ఎత్తున ధ్వంసమవుతున్న ఫుట్‌పాత్, రోడ్డు

ఎంవీపీ కాలనీ : పెదవాల్తేర్ డిపో దరి బీచ్‌రోడ్డును గత కొన్ని రోజులుగా ఎడాపెడా తవ్వి పడేస్తున్నారు. బీచ్‌రోడ్డును ఆనుకుని ఉన్న మేఘన టవర్స్ నుంచి వుడా పార్క్ వైపుగా యథేచ్ఛగా గత నెల రోజులుగా ఈ తవ్వకాలు జరుగుతున్నాయి. యూజీడీ వ్యవస్థ బ్లాక్ కావడంతో దాన్ని సరిచేసేందుకు తొలుత ఈ తవ్వకాలు చేపట్టినట్లు తెలిసింది. అయితే పక్కనే ఉన్న అపార్టుమెంట్లకు అనుకూలంగా వారి ఫ్లాట్స్‌లోని వినియోగ వ్యర్థాలు యూజీడీలోకి కలిపేందుకే ఈ విచ్చలవిడి తవ్వకాలు జరుపుతున్నట్లు తెలిసింది. ఈ తవ్వకాలతో పాత యూజీడీ పైపులను తొలగించి కొత్తవి వేస్తున్నారు. అయితే తొలుత మేఘన టవర్స్ ఎదుట చిన్నగా ప్రారంభమైన ఈ తవ్వకాలు వుడాపార్క్ వరకు విస్తరించాయి. విచ్చలవిడిగా తవ్విన మట్టిని ఫుట్‌పాత్‌లపై వేయడం, తవ్వి తీసిన పాత సిమెంట్ పైపులు ఫుట్‌పాత్‌ల మీద ఉన్న గ్రిల్స్‌పై పడేస్తుండడంతో ఫుట్‌పాత్‌కు పెద్ద ఎత్తున నష్టం జరుగుతోంది. విచ్చలవిడి తవ్వకాలతో ఫుట్‌పాత్‌తోపాటు రోడ్డు మార్గం కూడా అధ్వానంగా తయారైంది. గత నెల రోజులుగా ఈ తవ్వకాలు కొనసాగుతూనే ఉండటం, పనుల్లో విచ్చలవిడితనం కారణంగా బీచ్ రోడ్డులో ప్రయాణాలు చేసే వాహనదారులు, పర్యాటకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీవీఎంసీ అధికారులు ఎవరి మెప్పు కోసం ఈ విచ్చలవిడి తవ్వకాలు జరుపుతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ తవ్వకాలు జరిపిన వారిపై చర్యలు తీసుకుని పరిస్థితులను చక్కదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు.

కాలువలో పలక తొలగింపు

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు ఎంఎంటీసీ కాలనీ ప్రధాన రహదారి వద్ద మోడ్రన్ ఫుట్‌పాత్ కింద కాలువలో పలక పడిపోవడంతో మురుగు నీరంతా బుధవారం రోడ్డుపైనే వరదలా ప్రవహించింది. స్థానికుల ఫిర్యాదు మేరకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్, శుభ్రం మేస్త్రి రమణ వెంటనే స్పందించి కాలువలో అడ్డంగా ఉండిపోయిన పలకను తొలగించే చర్యలు చేపట్టారు. దీంతో రోడ్డుపై ప్రవహించే మురుగునీటిని నిలిపివేశారు. కాలువలో పలకతోపాటు పేరుకుపోయిన చెత్తను కూడా పారిశుధ్య సిబ్బంది తొలగించారు.

సీపీఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



సీపీఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆరిలోవ: సీపీఐ 28వ మహాసభలు ప్రకాశం జిల్లా ఒంగోలులో ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహ్మాన్ తెలిపారు. ఆరిలోవ ప్రాంతం అంబేడ్కర్ కూడలిలో బుధవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సభలకు విశాఖ జిల్లా నుంచి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. విశాఖ రైల్వే జోన్, ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ, నగరంలో గూడులేని పేదలకు రెండు సెంట్లు ఇంటి స్థలం మంజూరు, నగరంలో శాంతి భద్రతలు, మహిళలపై అత్యాచారాలు, తదితర వాటిపై చర్చించనున్నారన్నారు. కార్యక్రమంలో ఆరిలోవ జోన్ నాయకులు లక్ష్మణరావు, కాసుబాబు, కనకరాజు, పుష్పలత, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.